# తగిన శాస్తి




**ప**డుచుభార్యా, బ్యాంకు బ్యాలెన్సూ, బట్టతలా వున్న ఆసామీ లెవ్‌సావిచ్ ఒకనాడు మిత్రుడి బర్త్‌డే పార్టీరోజున పేకాటలో నిమగ్నమయ్యాడు. ఆడి ఆడీ జేబులు ఖాళీ అయింతర్వాత, విసుగుతో, విరక్తితో మొహమంతా చమట పట్టగా, రెండు పెగ్గులు కొడితే పోయిన ధైర్యం తిరిగివస్తుందని, వైనూ, వోడ్కా స్టాకు వున్న వెనక గదిలోకి తూలుతూ వెళ్లాడు.

ఒక బాటిల్ గ్లాసులోకి వంపుకొని తాగబోతుండగా, పక్కగదిలోంచి, 'ఎప్పుడు కలుద్దాం మళ్లీ, చెప్పు' అంటూ ఓ స్త్రీ కంఠం వినిపించింది.

'ఈ గొంతు ఎవరిదా' అని ఆశ్చర్యపడేలోగానే లెవ్‌సావిచ్‌కి తెలిసిపోయింది. ఆమె తన భార్య.

'నువ్వెప్పుడంటే అప్పుడే. ఇవాళ మాత్రం వీలుపడదు. రేపేమో నాకు కొన్ని ముఖ్యమైన పనులున్నాయి ' ఆ దుర్మార్గుడెవరో కాదు. డెగ్టియారోవ్.

'ఛ. అయితే ఈ కామపిశాచి వీణ్ణి వదల్లేదన్న మాట. రోజుకో కొత్త మనిషి కావాలా ఏమిటి దీనికి!' అంటూ నొసలు కొట్టుకున్నాడు లెవ్‌సావిచ్.

'నేను బిజీగానే వుంటాను గాని. నువ్వు నాకో వుత్తరం రాసి పంపించు. జాగ్రత్త. ఉత్తర ప్రత్యుత్తరాలు చాలా రహస్యంగా జరగాలి. పోస్టులో పంపించుకోవటానికి వీల్లేదు. ఉత్తరాన్ని నీకన్నా ముందు పోస్ట్‌మాన్నించి నీ బట్టతలగాడు లాక్కుంటాడు. ఇంక నీ వుత్తరం నాకన్నా ముందు మా ఆవిడ చదివేస్తుంది.

'మరెలాగ?'



**రష్యన్‌మూలం: చెహోవ్**
**తెలుగు గొంతు: కరుణారుణ**

'పనిమనుషుల్ని నమ్మటానికి లేదు. నీ బట్టతలగాడు పనిమనుషులకు లంచాలిచ్చి నీ ఉత్తరాలన్నీ తనకు చేరేలా చూసుకుంటాడు. ఇంతకూ ఏం చేస్తున్నాడు నీ 'మగతోడు'?

'పేకాడుతున్నాడు, ఇడియట్. కనీసం అక్కడైనా ఒక్కసారన్నా గెలిచింది లేదు.'

'పేకాటలో పోతేనేం నువ్వు దొరకటమే వాడి అదృష్టం. ..... డార్లింగ్, ఓ అయిడియా తట్టింది. రేపు నేను ఏదో వంకతో పార్కుకు వస్తాను. అక్కడ ద్రాక్ష పందిరికింద ఉన్న చలువరాతి పూలకుండీలో నీ ఉత్తరం దాచు. ఆరింటికి ముందు. విన్నావా? ఆరింటికి ముందే. తర్వాత కాదు...'

'అలాగే'

'రహస్యం. నీ దేభ్యంగాడికీ తెలియకూడదు. మా ఆవిడకూ తెలియకూడదు.'

లెవ్‌సావిచ్ మరో పెగ్గు లాగించి పేకాట రూంలోకి వచ్చాడు. ఈ సంభాషణ అతణ్ణి షాక్ చెయ్యలేదు. కనీసం ఆశ్చర్యం కూడా కలిగించలేదు. కొన్నాళ్ల క్రితమైతే బాధపడేవాడు. కోపం తెచ్చుకునేవాడు. తిట్టుకునేవాళ్లు.

కొట్టుకునేవాళ్లు. భార్య స్వభావం మారదని తెలుసుకున్నాక, ఆమె చర్యలేవీ అతణ్ణి బాధించడంలేదుగాని, వాడు తనను బట్టతల అనీ, దేభ్యం అనీ అనటం మాత్రం జీర్ణించుకోలేకపోయాడు.

డెగ్టియారోవ్ నయవంచకుడు. బజారులో కనిపిస్తే మర్యాదలు వొలకబోస్తాడు. లోపల్లోపలేమో పక్కవాళ్ల పెళ్లాలను ఎగరేసుకుపోవటానికి కుట్ర చేస్తుంటాడు. పైగా తనను 'బట్టతల' అంటాడా!

భోజనం చేస్తున్నంతసేపూ డెగ్టియాకోవ్ జ్ఞాపకం అన్నం సయించకుండా చేసింది. పైగా ప్రేమ నటిస్తూ భార్య వేసే అప్రస్తుత ప్రశ్నలు.

'గెలిశావా? పోయిందా? ఎంతపోయింది?'

ఇంటికొచ్చాక లెవ్‌సావిచ్‌కు కోపం తిరగదోడింది.

'ఆ గాడ్డి కొడుకు మొహంమీద వుమ్మేసి రెండిచ్చుకున్నా పోయేది' అనుకున్నాడు. ఎలాగైనా ఇవి రాసే ఉత్తరం తీసుకుని, దాని బదులుగా బూతుకూతలన్నీ రాసిన మరో వుత్తరం అక్కడ పెట్టెయ్యాలి.

కోపంతో వుడికిపోతున్న లెవ్‌సావిచ్‌కు ఓ బ్రిలియంట్ అయిడియా వచ్చింది.

ఓ వ్యాపారస్తుణ్ణి బ్లాక్‌మెయిల్ చేస్తూ, డెగ్టియారోవ్ రాసినట్టుగా ఓ ఉత్తరం రాశాడు.

'రేపు సాయంత్రం ఆరింటివరకు రెండువందల రూబుల్లో ఫలానీ పూలకుండీలో వుంచకపోయినట్టయినచో, నీ కిరాణాకొట్టు బాంబుల్తో పేలిపోతుంది. నీ శరీరం తుత్తునియమైపోతుంది.'

వండర్‌ఫుల్. ఆ వ్యాపారస్తుడు ఈ వుత్తరాన్ని పోలీసులకు చూపిస్తాడు. వీళ్ల బండారం బయటపడుతుంది. డెగ్టియారోవ్ చాప్టర్ ముగుస్తుంది.

లెవ్‌సావిచ్ వుత్తరం పోస్టు చేసి వచ్చి తృప్తిగా నిద్రపోయాడు. తెల్లారిలేవగానే ఆ సాయంత్రం పోలీసులు డెగ్టియారోవ్‌ను బేడీలు వేసి తీసుకుపొయ్యే దృశ్యం వూహించుకొని సంతోషంతో వుబ్బితబ్బిబ్బయ్యాడు.

..... రోజంతా చాలా అసహనంగా గడిచింది.

సాయంత్రం అయిదింటికే ప్రయాణమయ్యాడు పార్కుకు. దూరంగా పోలీసు కనిపించాడు. 'హమ్మయ్య ఈ డెగ్టియారోవ్ గాడికి తగిన శాస్తి జరగబోతోంది.'

పూలకుండీకి కొంచెం దూరంలో నిల్చుని పరిశీలించాడు. సరిగ్గా ఆరింటికి డెగ్టియారోవ్ వచ్చాడు.

'రారా గుంటనక్కా. ఇంక నీకు జైలే గతి.' అంటూ కసిగా పళ్లు కొరికాడు లెవ్ సావిచ్.

డెగ్టియారోవ్ పూలకుండీలో చేయిపెట్టి ఓ పాకెట్ బైటకి తీశాడు. ఇదేమిటి. ఇంత లావుగా వుంది' అనుకుంటూ లోపలి కాగితాలు ఆశ్చర్యంగా బైటకి లాగాడు. రెండు వందల రూబుళ్లు. అటూ యిటూ చూసి.

'గాడ్ ఈజ్ గ్రేట్' అనుకుంటూ డబ్బులు జేబులో పెట్టుకొని నడిచిపోయాడు.

'పిరికిపంద. బెదిరింపు వుత్తరాలను పోలీసులకివ్వాలనైనా తెలియదు' అని తిట్టుకుంటూ తల బాదుకున్నాడు లెవ్‌సావిచ్. ■


